క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 12న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. టీబీ ఆస్పత్రి వెనుక ప్రాంతం, కనకయ్య హోటల్, మహాత్మానగర్, గణపతినగర్ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, నయీంనగర్, లష్కర్ సింగారం, రాంనగర్, రాజాజీ నగర్, పోలీస్ హెడ్ క్వార్టర్స్ వెనుక వైపు ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు ఏసోబు సంస్మరణ సభ

మడికొండ: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఎన్‌కౌంటర్‌లో ఈనెల 2వ తేదీన మృతి చెందిన కాజీపేట మండలం టేకులగూడెం గ్రామానికి చెందిన కామ్రేడ్ మాచర్ల ఏసోబు అలియాస్ జగన్ అలియాస్ రణదేవ్‌దాదా సంస్మరణ సభను టేకులగూడెంలో గురువారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సంఘం సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని లక్ష్మక్క స్తూపం వద్ద కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

18న పీడీఎస్ బియ్యం వేలం

వరంగల్: తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ అనుమతితో ఈనెల 18న బహిరంగ వేలం వేయనున్నట్లు వరంగల్ అదనపు కలెక్టర్ సంధ్యారాణి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఐదు ప్రాంతాల్లో సుమారు రూ.10.52 లక్షల విలువైన 375.50 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా పౌరసరఫరాల అధికారి కార్యాలయంలో వేలం నిర్వహిస్తారని తెలిపారు.

జర్నలిస్ట్ కుటుంబానికి సాయం



న్యూశాయంపేట: వరంగల్‌లో మూడు దశాబ్దాల పాటు సియాసీ ఖూనూన్ ఉర్దూ దినపత్రికలో జర్నలిస్టుగా సేవలందించి ఇటీవల కాలంలో అనారోగ్యంతో మరణించిన వరంగల్ చార్‌బౌలికి చెందిన సీనియర్ జర్నలిస్టు యూసుఫ్ షరీఫ్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సాయం ప్రకటించింది. ఈమేరకు ప్రభుత్వం అందించిన చెక్కును షరీఫ్ కుటుంబ సభ్యులకు టీయూడబ్ల్యూజేఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఉర్దూ వర్కింగ్ జర్నలిస్టు అధ్యక్షుడు సాజిద్ పాషా, జర్నలిస్టులు కలిసి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఇస్మాయిల్ జబీ, నయీంపాషా, మహ్మద్ అమీర్, హుస్సేన్ పాషా, అక్తర్‌హుస్సేన్, ఎండీ.అక్రమ్, జాబ్రీ, బాబర్, ఎజాజ్, రియాజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

మాధవీలతకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం పరిశోధకురాలు ఎస్.మాధవీలతకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఏ స్టడీ ఆన్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ పర్ఫార్మెన్స్ ఇన్ స్మాల్ అండ్ మీడియం స్కేల్ ఇండస్ట్రియల్ యూనిట్స్ విత్ స్పెషల్ రెఫరెన్స్ టూ సెలక్టెడ్ డిస్ట్రిక్ట్ ఆఫ్ తెలంగాణ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి మాధవీలతకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నర్సింహాచారి తెలిపారు. కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ కృష్ణమాచార్య పర్యవేక్షణలో మాధవీలత తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

డీఏలు విడుదల చేయాలి

ఖిలా వరంగల్: ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలు, పీఆర్సీలను తక్షణమే ప్రభుత్వం విడుదల చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కదారి భోగేశ్వర్ డిమాండ్ చేశారు. ఈమేరకు మధ్యకోట ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ ప్రాథమిక పాఠశాలకు తరగతికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున నియమించాలని కోరారు. కార్యక్రమంలో పూజారి మనోజ్, స్వామి, అశోక్, వెంకట్, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

మామునూరు: మద్యానికి బానిసై.. కుటుంబ సభ్యుల మందలింపుతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం తెల్లవారు జామున వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై టీచర్‌కాలనీలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వరంగల్ రంగశాయిపేట ప్రాంతానికి చెందిన తాళ్లూరి అప్పయ్యాచారి వడ్రంగి పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 7వ తేదీన కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురై షాపులో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు ఉదయ్ కుమార్ ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ వివరించారు.

కలుషిత నీటితో అనారోగ్యం



అనారోగ్యంతో మంచంపట్టిన మహిళ



అధికారులతో వాగ్వాదం చేస్తున్న స్థానికులు

- గంటూరుపల్లిలో విజృంభిస్తున్న విషజ్వరాలు
- గ్రామాన్ని సందర్శించిన అధికారులు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం గంటూరుపల్లి గ్రామంలో కలుషిత నీరు తాగి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. నెల రోజులుగా ఈ గ్రామంలో మిషన్ భగీరథతో పాటు బావినీరు సరఫరా చేయడంతో ఆ నీరు తాగి ప్రజలు మంచం పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ సందర్భంగా గంటూరపల్లి గ్రామాన్ని మండల పంచాయతీ అధికారి కర్ణాకర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సందర్శించారు. తాగునీరు కలుషితం కావడంతోనే తాము అనారోగ్యానికి గురవుతున్నట్లు అధికారులకు స్థానికులు వివరించారు. గ్రామ సమస్యలపై ప్రశ్నించినందుకు స్పెషల్ ఆఫీసర్ క్రాంతికుమార్ తన పట్ల దుర్భాషలాడారని మాజీ సర్పంచ్ కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే నాగరాజు, ఎంపీడీఓ, ఎంపీఓల దృష్టికి తీసుకెళ్లారు.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

విధుల్లో స్పెషల్ ఆఫీసర్ నిర్లక్ష్యంగా వ్యవహిస్తున్నాడనే విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తా. స్పెషల్ ఆఫీసర్ పాలన ప్రారంభమైనప్పటికీ నుంచి ఇప్పటి వరకు రిజిస్టర్‌లో ఆయన సంతకం కూడా లేదు.

\- కర్ణాకర్‌రెడ్డి, ఎంపీఓ

నెలరోజులుగా బాధపడుతున్నా

నెలరోజులుగా నొప్పులతో బాధపడుతున్నా. ఆస్పత్రిలో చికిత్స కోసం రూ.80వేలు ఖర్చు చేశా. చికెన్ గున్యా అని డాక్టర్లు చెప్పారు.

\- కల్పన, స్థానికురాలు

ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లే స్తోమత లేదు

జ్వరం వస్తే ఆస్పత్రికి వెళ్లా. వైద్య పరీక్షలు చేయిస్తే రూ.15వేలు ఖర్చు అయ్యాయి. కూలీ పనిచేసి బతుకుతున్నా. ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేసుకునే స్తోమత నాకు లేదు.

\- రమ, స్థానికురాలు

ఎర్రజెండా నీడలోనే సాయుధ పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

మామునూరు: ఎర్రజెండా నీడలోనే సాయుధ పోరాటం జరిగిందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు తెలిపారు. ఖిలా వరంగల్ బొల్లికుంట సీపీఐ కాలనీ అంబేడ్కర్ నగర్‌లో సీపీ మండల కార్యదర్శి దండు లక్ష్మణ్ ఆధ్వర్యంలో రైతాంగ సాయుధ పోరాట 76వ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమర వీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరగడానికి అనేక కారణాలు ఉన్నాయన్నారు. ఆనాడు ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణ లేదని వాపోయారు. నైజాం మూకలు చెలరేగి ప్రజల్ని చిత్రహింసలకు గురిచేసేవారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మేకల రవి, పంజాల రమేష్, ఎస్‌కె.బాషుమియా, గన్నారపు రమేష్, రవీందర్, కృష్ణ, రాజు, అక్బర్‌పాషా, సువర్ణ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలి



కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న రాగుల రమేష్

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి వైద్యశాలలో (జీఎంహెచ్) పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్ చేశారు. కార్మికుల స్థితిగతులపై బుధవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్ పూర్తి స్థాయిలో జమకావడం లేదన్నారు. కార్మికులపై అధికారులు, సూపర్‌వైజర్ల వేధింపులు ఎక్కువయ్యాయని సర్వేలో తేలిందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 28వ తేదీన కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కళావతి, అనిల్, సదానందం, రమ, కోమల, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న పరమేశ్వర్

వరంగల్: భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని నాయకుడు సముద్రాల పరమేశ్వర్ పిలుపునిచ్చారు. వరంగల్ జిల్లా తూర్పులో 21వ డివిజన్ 70, 88, 89, 95, 96 బూత్ శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ అపురూప రజనీష్ నేత అధ్యక్షతన సభ్యత్వ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా పరమేశ్వర్ మాట్లాడుతూ బలమైన భారతదేశం కోసం, వికసిత్ భారత్ నిర్మాణం కోసం బూత్ అధ్యక్షులు తమ బూత్‌లలోని ప్రజలకు పార్టీ సిద్ధాంతం, బీజేపీ పరిపాలనలో సాధించిన విజయాలు, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించి పార్టీలో సభ్యులుగా చేర్పించాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, డివిజన్ సభ్యత్వ ప్రముఖ్ సిద్దోజ శ్రీనివాస్, బూత్‌ల అధ్యక్షులు మామిడాల సురేష్, జగన్, దోమల భవాని శంకర్, అరుణ్ సాయి, వంగరి ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చోరీ నిందితుడి అరెస్ట్

రామన్నపేట: మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జూలై 27వ తేదీన మూడు ఐరన్ షాపుల్లో తాళాలు పగులగొట్టి రూ. 35వేలు అపహరించిన జువ్వనూరు సలీం అలియాస్ ఎండీ.సలీంను బుధవారం అరెస్టు చేసినట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి తెలిపారు. కనకదుర్గ షాపు యజమాని సల్ల శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ గోపి వివరించారు.

హౌసింగ్ బోర్డులో చైన్ స్నాచింగ్

వరంగల్ క్రైం: అదాలత్ నుంచి హౌసింగ్ బోర్డు కాలనీ వైపు నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళ మెడలో నుంచి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి బంగారు గొలుసు ఎత్తుకెళ్లారని సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి తెలిపారు. బాధితురాలు అనుమండ్ల సమ్మక్క మెడలో నుంచి సుమారు 3 తులాల బంగారు గొలుసును ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

ఒకరికి జైలుశిక్ష

రామన్నపేట: వరంగల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన వరంగల్‌లో ఎల్‌బీనగర్‌కు చెందిన పైరాల నాగరాజుకు మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి తీర్పు వెల్లడించినట్లు వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిగతా 26 మందికి రూ.39,400 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. అలాగే, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడుపుతూ పట్టుబడిన ఏడుగురు వాహనదారులకు రూ.8,500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెల్లడించినట్లు సీఐ వివరించారు.

డీసీఎం వాహనం బ్యాటరీలు చోరీ

ఖిలా వరంగల్: వరంగల్ ఓసిటీలో పార్కింగ్ చేసిన డీసీఎం వాహనంలోని రూ.20 వేల విలువైన బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. బాధితుడు, పోలీసుల కథనం ప్రకారం వరంగల్, ధర్మారం గ్రామానికి చెందిన వల్లంల మహేందర్‌కు చెందిన డీసీఎం వాహనంలోని రూ.20వేల విలువైన బ్యాటరీలు బుధవారం తెల్లవారుజామున చోరీకి గురయ్యాయి. బాధితుడు మహేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు.

సంక్షిప్తంగా

ఐలమ్మ పేరును స్వాగతిస్తున్నాం..

హన్మకొండ: హైదరాబాద్ కోఠి మహిళా విశ్వవిద్యాలయానికి వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామని బీసీ జేఏసీ చైర్మన్ తిరునహరి శేషు తెలిపారు. చాకలి ఐలమ్మ వర్ధంతి రోజు ఈ నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్ రెడ్డికి, ప్రభుత్వానికి ఆయన ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఐలమ్మ మనవరాలు శ్వేతకు మహిళా కమిషన్ సభ్యురాలిగా, షాద్‌నగర్ ఎమ్మెల్యే ఈర్ల శంకర్‌కు ప్రజా పద్దుల కమిటీ చైర్మన్‌గా అవకాశం కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు.

చిన్నారులకు కథలతో విద్యనందించాలి

ఖిలా వరంగల్: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆటపాటలు, చక్కటి కథలతో విద్యనందించాలని టీచర్లకు ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ రమాదేవి సూచించారు. వరంగల్ 39వ డివిజన్ శాకరాశికుంటలోని అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్లు మహాలక్ష్మి, సుభాషిణి ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పోషకాలను గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించాలన్నారు.

కడిపికొండ రాజీవ్ గృహకల్పలో కార్డన్ సెర్చ్

మడికొండ: మడికొండ పోలీసు స్టేషన్ పరిధిలోని కడిపికొండలోని రాజీవ్ గృహకల్ప, ఇందిరమ్మ కాలనీల్లో కాజీపేట ఏసీపీ తిరుమల్ ఆధ్వర్యంలో బుధవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ తిరుమల్ మాట్లాడుతూ కాలనీల్లో అవాంఛనీయ సంఘటనలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అత్యవసర సమయంలో 100 నంబర్‌కు డయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో మడికొండ ఎస్‌హెచ్‌ఓ పులాల కిషన్, ఎస్సై రాజబాబు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగంతో ముప్పు

రామన్నపేట: నేటి సమాజంలో మాదకద్రవ్యాల వినియోగం పెరిగిపోతోందని, ఇది చాలా ప్రమాదకరమని మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి పేర్కొన్నారు. మట్టెవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ పొగాకు, గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. హెచ్ఎం అరుణ, తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

హసన్‌పర్తి: చేనేత రుణాలు మాఫీ చేయడమే కాకుండా బతుకమ్మ చీరల బకాయిలు విడుదల చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంపై సంఘం కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు హసన్‌పర్తి చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి సంఘం కార్మికుల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి బుధవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పద్మశాలి సేవా సంఘం హసన్‌పర్తి మండల మాజీ అధ్యక్షుడు అనుమాండ్ల విద్యాసాగర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నిర్ణయంతో చేనేత కార్మికుల ఆకలి చావులు ఆగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి సంఘం హసన్‌పర్తి అధ్యక్షుడు మాటేటి భాస్కర్, ఉపాధ్యక్షులు కందకట్ల కుమారస్వామి, ముత్తయ్య, కార్యదర్శి విజయ్‌భాస్కర్, పద్మశాలి సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం సందర్శన

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అండ్ హెచ్‌ఆర్ఎం విభాగాన్ని కేయూ పాలకమండలి సభ్యుడు పుల్లూరు సుధాకర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విభాగం పనితీరును పరిశీలించారు. లైబ్రరీ నిర్వహణ, తరగతుల నిర్వహణ, సీసీ కెమెరాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలు, రిటైర్డ్ ప్రొఫెసర్లతో ఏర్పాటు చేస్తున్న గెస్ట్‌లెక్చర్ల గురించి ఆ విభాగం అధిపతి ప్రొఫెసర్ పెదమళ్ల శ్రీనివాస్ రావు వివరించారు.

రైతులకు మేలు జరిగేలా చూడాలి

హన్మకొండ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం తీసుకురానున్న నూతన రెవెన్యూ చట్టం -2024.. రైతులకు మేలు జరిగేలా ఉండాలని తెలంగాణ రైతు సంఘం సలహాదారుడు డాక్టర్ వీరస్వామి, రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ అన్నారు. ఈమేరకు వారు హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డిని బుధవారం కలిసి మెమోరాండం అందించారు.

జాతీయ సేవారత్న అవార్డుకు సుమన్ ఎంపిక

వరంగల్: జాతీయ సేవారత్న పురస్కారానికి ప్రభుత్వ ఉపాధ్యాయుడు, సామాజిక సేవకుడు, యువ నేతాజీ ఫౌండేషన్ ప్రధాన సభ్యుడు గజ్జెల సుమన్ ఎంపికయ్యారు. బెంగుళూరుకు చెందిన సోమల రాజు ఫౌండేషన్ 12 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒరిస్సాతో పాటు వివిధ రాష్ట్రాల్లో కళా, సాంస్కృతిక, సేవా రంగాల్లో కృషి చేస్తున్న వారిని గుర్తించి వివిధ పురస్కారాలు అందజేస్తున్నారు. ఈ సందర్భంగా హనుమకొండలో ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న సుమన్‌ను ఈ అవార్డుకు ఎంపిక చేసి ఈనెల 14వ తేదీన జరగనున్న సంస్థ వార్షికోత్సవంలో ప్రదానం చేయనున్నారు.

30న 'చలో హైదరాబాద్'

కాశిబుగ్గ: కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, అసంఘటిత రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు అనురాధ, శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కాశిబుగ్గలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంగుల దయాకర్ అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీతారామయ్య, శ్రీధర్, శివబాబు, గడ్డం నాగరాజు, మేకల రాజన్న, రాజేందర్ పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి రూ.లక్ష విరాళం

కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గలోని రంగనాథస్వామి దేవాలయ అభివృద్ధికి కాశిబుగ్గకు చెందిన గడ్డం సదానందం బుధవారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో అర్చకుడు ఆరుట్ల కృష్ణమాచార్యులు, కోశాధికారి సుల్తానా సమ్మక్క, కూరపాటి రోజా, గడ్డం భాస్కర్, దూడం రాజనారాయణ పాల్గొన్నారు.

వెంటనే కులగణన చేపట్టాలి

హన్మకొండ: హైకోర్టు తీర్పు మేరకు వెంటనే కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ సూచించారు.. హైకోర్టు తీర్పును గౌరవించి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే బీసీ కులగణనపై రోడ్ మ్యాప్ ప్రకటించాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచాలని తెలిపారు. సుదీర్ఘ వాదన తర్వాత బీసీల పక్షాన న్యాయం, ధర్మం ఉందని గ్రహించి కులగణన నిర్వహించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు తీర్పు ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ తీర్పుతో బీసీలకు న్యాయం జరుగుతుందనే విశ్వాసం కలిగిందని పేర్కొన్నారు.

గౌడ సంఘం అధ్యక్షుడిగా రఘుగౌడ్

కాజీపేట రూరల్: తెలంగాణ గౌడ సంఘం కాజీపేట 48వ డివిజన్ అధ్యక్షుడిగా దర్గాకు చెందిన మోడం రఘుగౌడ్ నియామకమయ్యారు. ఈమేరకు తెలంగాణ గౌడ సంఘం హనుకొండ జిల్లా అధ్యక్షుడు శ్రీపతిగోపి గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం నియమించారు.

సఖి సేవలను వినియోగించుకోవాలి



మడికొండ: కరపత్రాలను విడుదల చేస్తున్న సఖి సెంటర్ నిర్వాహకులు, మహిళలు



వరంగల్ చౌరస్తా: వాల్‌పోస్టర్లను ప్రదర్శిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

మడికొండ: సఖి సేవలను బాధిత మహిళలు, బాలికలు వినియోగించుకోవాలని సఖి లీగల్ కౌన్సెలర్ శ్రీదేవి సూచించారు. మడికొండ ఎస్సీ కాలనీలో ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో సఖి సేవలపై మహిళలకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గృహహింస, లైంగిక వేధింపులు, పనిచేసే చోట వేధింపులు, అత్యాచారాలు, తదితర వేధింపుల నుంచి రక్షణ పొందటానికి సఖి సెంటర్ అండగా నిలుస్తోందని చెప్పారు. సఖి సెంటర్ 24 గంటలు పని చేస్తుందని, ఏదైనా సమస్య ఎదురైనప్పుడు 181, 0870 2452112, 73829 83088 నంబర్లలో సంప్రదిస్తే తక్షణ రక్షణ కల్పిస్తామని వివరించారు. కార్యక్రమంలో కేసు వర్కర్ వినీల, టైలరింగ్ టీచర్ అనూష, శిక్షణ పొందుతున్న మహిళలు పాల్గొన్నారు.

హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించుకోవాలి

వరంగల్ చౌరస్తా: మానవ అక్రమ రవాణా, లేబర్ ట్రాఫికింగ్, లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, సైబర్ మోసాలపై 1098, 181, 100, 1930 నంబర్లను బాధితులు సంప్రదించాలని వరంగల్ సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ వసుధ సూచించారు. వరంగల్ కృష్ణా కాలనీలోని ప్రభుత్వ కళాశాల, హైస్కూల్‌లో విద్యార్థినులకు బుధవారం అవగాహన కల్పించారు. మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వరంగల్ ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ వెంకన్న మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా హేయమైన చర్య అని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు. అనంతరం వాల్‌పోస్టర్లు, కరపత్రాలను ప్రదర్శించారు.

'పింగిళి'లో సౌభ్రాతృత్వ దినోత్సవం



వేడుకల్లో ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థినులు

హన్మకొండ అర్బన్: వడ్డెపల్లిలోని పింగిళి మహిళా కళాశాలలో ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ సౌభ్రాతృత్వ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రమౌళి మాట్లాడుతూ వివేకానంద చికాగో ఉపన్యాస విశేషాలను విద్యార్థులకు వివరిస్తూ, ఆయనను ఆదర్శంగా తీసుకొని జీవితంలో ముందుకెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వక్తృత్వ పోటీల విజేతలైన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ ఆవుల మీనాక్షి, అధ్యాపకులు సుజాత, సువర్ణ, రామిరెడ్డి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ యశస్విని

రామన్నపేట: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంజీఎం ఆస్పత్రి యూఎఫ్‌డబ్ల్యూసీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.యశస్విని సూచించారు. అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్ ఆధ్వర్యంలో నగరంలోని ఆటోనగర్‌లోని జువైనల్ వెల్ఫేర్ సర్వీస్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ స్ట్రీట్ చిల్డ్రన్స్‌లో చిన్నారులకు బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ యశస్విని మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు వహించాలని, వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని చెప్పారు. ముఖ్యంగా గుడ్లు, పాలు, బ్రెడ్ లాంటివి తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని వివరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీదేవి, ఎంజీఎం హెచ్‌వీ నర్సమ్మ, రామ రాజేష్ ఖన్నా, ఆశ వర్కర్ నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

అతి ఆలోచనలే ఆత్మహత్యకు దారి



మాట్లాడుతున్న డాక్టర్ ప్రహసిత్

హసన్‌పర్తి: అతిగా ఆలోచించడం ఆత్మహత్యకు దారి తీస్తుందని ప్రముఖ మానసికవేత్త డాక్టర్ ప్రహసిత్ అన్నారు. ఆత్మహత్యల నివారణ వారోత్సవాలను పురస్కరించుకుని హసన్‌పర్తిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువశాతం కౌమార దశలోనే విద్యార్థులు ఎక్కువగా ఆత్మహత్యలు చేసుకుంటారని చెప్పారు. ఆత్మహత్యలను ప్రేరేపించే అంశాలు, వాటి నివారణ గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ సునీత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్టూడెంట్ కౌన్సెలర్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సాహెబ్, అధ్యాపకులు హరిప్రసాద్, వి.సరిత, రవిప్రకాష్, పద్మారాణి, సుమలత, సౌజన్య, మల్లయ్య, రమేష్ పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధిని బీఆర్ఎస్ నిర్లక్ష్యం చేసింది



సమావేశంలో మాట్లాడుతున్న కర్రె భిక్షపతి

మడికొండ: తెలంగాణ రాష్ట్రాభివృద్ధిని బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి విమర్శించారు. రాంపూర్ గ్రామంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల్లో అక్కడి రాష్ట్ర ప్రభుత్వాలు సెప్టెంబర్ 17ను అధికారికంగా జరుపుకుంటాయని తెలిపారు. 17న అధికారికంగా సాయుధ పోరాట దినోత్సవాన్ని ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం జరపాలని డిమాండ్ చేశారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి మంజూరైన రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ, ములుగులో గిరిజన యూనివర్సిటీకి నిధులు విడుదల చేయడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వహించిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శులు మద్దెల ఎల్లేష్, తోట భిక్షపతి, మునిగాల భిక్షపతి, లక్ష్మి, పద్మ, బి.భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

'శ్వేతార్క'లో జేష్ఠాదేవి పూజలు



పూజలు చేస్తున్న మహిళలు

కాజీపేట: కాజీపేట పట్టణంలోని స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో మహిళలు బుధవారం జ్యేష్ఠాదేవి పూజలు నిర్వహించారు. స్వామివారికి శతాధిక నారికేళ పానీయంతో అభిషేకం చేశారు. 308 కిలోల పసుపుతో అయిదున్నర ఫీట్ల ఎత్తు గల పసుపు గౌరమ్మను తయారుచేశారు. అమ్మవారికి పట్టుచీర కట్టి ఆభరణాలతో అలంకరించారు. భక్తులతో దేవాలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు ఐనవోలు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ గౌరీపూజ చేయించారు. సహస్ర లడ్డూ (పుట్నాలు, బెల్లం)లతో పూజలు చేశారు. అమ్మవారికి మహతి, కల్యాణి మంగళ హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు శర్మ మాట్లాడుతూ జేష్ఠాదేవి పూజల వల్ల కలిగే ఫలితాలపై ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ఉత్సవాల ఇన్‌చార్జ్ తుమ్మ శ్రీనివాస్, కె.భాస్కర్ రావు, కె.రమాదేవి, రజిత, అనురాధ, ఉమాదేవి, సాయికుమారి, శ్రీనమ్మ, విజయలక్ష్మి, విజయకోటి, సులోచన, సుజాత, సరోజన తదితరులు పాల్గొన్నారు.

వేయిస్తంభాల ఆలయంలో సర్ప గణపతిగా పూజలు

హన్మకొండ కల్చరల్: హనుమకొండలోని రుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల దేవాలయంలో జరుగుతున్న ఉత్థిష్ట గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు బుధవారం మూల మహాగణపతిని సర్ప గణపతిగా అలంకరించారు. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ, వేద పండితుడు మణికంఠశర్మ, అర్చకులు సందీప్‌శర్మ, ప్రణవ్ ఆధ్వర్యంలో రుద్రేశ్వర స్వామికి రుద్రాభిషేకం, పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమేష్‌బాబు దంపతులు పాల్గొని స్వామివారికి గరికపూజ నిర్వహించారు.